క్లుప్తంగా

కన్నులపండువగా సత్యదేవుని గ్రామోత్సవం



వరదయ్యగారి వీధిలో సత్యదేవుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవార్ల ధనుర్మాస గ్రామోత్సవం శనివారం కన్నులపండువగా జరిగింది. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు, ఇండియన్ బ్యాంక్ వెనుక వరదయ్య వీధి, వెలంపేట తదితర ప్రాంతాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఏటా భోగి పండగ నాడు మాత్రమే ఈ వీధుల్లో స్వామివారిని ఊరేగిస్తారు. ప్రతి ఇంటి వద్ద భక్తులు స్వామివారి పల్లకీకి ఘనంగా స్వాగతం పలికి స్వామివారికి నివేదనలు సమర్పించారు.

'వరుపుల'ను కలసిన పోలీస్ అధికారులు



లింగంపర్తిలో వరుపుల సుబ్బారావును కలిసిన పోలీస్ అధికారులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావును ఆదివారం పోలీసు అధికారులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. లింగంపర్తిలో ఆయన ఇంటి వద్ద సీఐ శేఖర్‌బాబుతో పాటు ఏలేశ్వరం, ప్రత్తిపాడు, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు జి.సతీష్, పవన్‌కుమార్, కిషోర్, అబ్దుల్ నబీలు వరుపులను కలిశారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వరుపుల పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు పాల్గొన్నారు.

రామాలయానికి మైక్‌సెట్ బహూకరణ



జగపతినగరంలో రామాలయానికి మైక్‌సెట్‌ను అందజేస్తున్న బాబీ దంపతులు

కిర్లంపూడి: జగపతినగరంలోని కాపుల రామాలయానికి రూ.42 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను చదలవాడ బాబీ, మహాలక్ష్మి దంపతులు బహూకరించారు. ఈ మేరకు ఆదివారం రామాలయం ఆలయ కమిటీ సభ్యులకు మైక్‌సెట్‌ను అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలతో దాతలను సత్కరించారు. కార్యక్రమంలో లంక మూర్తి, పబ్బిరెడ్డి అర్జున్, అప్పికొండ కొండబాబు, నక్కా అప్పలరాజు, నక్కా రమణ, యామన సత్తిబాబు, మాదిరెడ్డి గణపతి, కరణం అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సెబ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా దాడులు చేసి వంద లీటర్ల సారా, 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో మోటారు బైక్‌పై సారా తరలిస్తున్న బొందలపు రమణను అదుపులోకి తీసుకుని, అతని నుంచి బైక్‌తో పాటు వంద లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో రీసు రాఘవపై కూడా కేసు నమోదు చేశారు. పెద్దిపాలెం సమీపంలో సారా స్థావరాలపై దాడులు చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. శంఖవరం మండలం శృంగధార గ్రామంలో గూడెం లక్ష్మిని అదుపులోకి తీసుకుని, ఆమె నుంచి 14 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు, హెచ్‌సీలు వెంకన్నదొర, కృష్ణార్జున తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

తొండంగి: మండలంలోని వాకదారిపేటలో కోడిపందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై వినయ్‌ప్రతాప్ ఆదివారం తెలిపారు. వాకదారిపేట గ్రామ శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేసి రెండు కోడి పుంజులు, రూ.640 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై వినయ్‌ప్రతాప్ ఆదివారం తెలిపారు. ఒంటిమామిడి గ్రామశివారులో పేకాడుతున్నారనే ముందస్తు సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.550 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సంక్రాంతి వచ్చిందే తుమ్మెద

- పల్లెల్లో పెద్ద పండగ సందడి
- కొత్త అల్లుళ్లతో కళకళలాడుతున్న ఇళ్లు
- గ్రామాల్లో సందడే సందడి

ఏలేశ్వరం/తుని/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: తెలుగువారి సంప్రదాయ పండగైన సంక్రాంతిని సోమవారం ఘనంగా జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ ఏడాదంతా అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరుతూ ప్రతి ఇంటా పెద్దలకు, దేవతలకు పూజలు చేయనున్నారు. పొట్టకూటి కోసం ఉన్న ఊరును విడిచిపెట్టి వెళ్లిన వారంతా ఇప్పటికే సొంతూళ్లకు తిరిగి వచ్చారు. పట్టణాల్లో ఉద్యోగాలు చేసేవారు, బంధువుల రాకతో ముఖ్యంగా కొత్త అల్లుళ్ల రాకతో పల్లె సీమలు కళకళలాడుతున్నాయి. భోగి పండగ ముగియడంతో మకర సంక్రాంతి, కనుమ ఏర్పాట్లలో గ్రామీణులు తలమునలకయ్యారు. అల్లుళ్ల కోసం రకరకాల పిండివంటలు చేశారు. పలు గ్రామాల్లో మహిళలకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఏలేశ్వరం పట్టణం కళకళలాడింది.

రంగవల్లులతో స్వాగతం

ప్రజలు పాడి పంటలు, పశుసంపద, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుతూ మూడు రోజుల పాటు సంక్రాంతి పండగను ప్రజలు వైభవంగా జరుపుకుంటున్నారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా తొలిరోజు భోగిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సంక్రాంతికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. అందులో గొబ్బెమ్మలు పెట్టి గుమ్మడి, తంగేడు తదితర పూలతో అలంకరించి పూజలు చేస్తున్నారు.

సంప్రదాయాల సందడి

సంక్రాంతి సంప్రదాయాలైన గంగిరెద్దులు, హరిదాసుల సందడి నెలకొంది. గ్రామాల్లో గంగిరెద్దుల వారు ఇంటింటా తిరిగి బియ్యం, పప్పుదినుసులు వసూలు చేశారు. వీరికి కొత్తగా పెళ్లైన వారు పెళ్లికి కొనుగోలు చేసిన కర్పూర దండలతో పాటు వస్త్రాలు, నగదు అందజేశారు. అలాగే నెలరోజుల పాటు నగర సంకీర్తన చేసిన హరిదాసులు సంక్రాంతిని పురస్కరించుని బియ్యంతో పాటు కానుకలు స్వీకరించారు.



తుని సంక్రాంతి సంబరాల్లో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



ఏలేశ్వరంలో హరిదాసుకు బియ్యం వేస్తున్న కుటుంబ సభ్యులు



గజ్జనపూడిలో మహిళలు పెట్టిన రంగవల్లులను తిలకిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తునిలో సాంప్రదాయ దుస్తులు ధరించి భోగి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, మహిళలు

కిక్కిరిసిన రోడ్లు

సంక్రాంతికి కొనుగోళ్లతో ఏలేశ్వరం పట్టణంలోని ప్రధానరహదారులన్నీ కిక్కిరిశాయి. ఉదయం నుంచి నర్సీపట్నం రోడ్డు, మార్కెట్ రోడ్డు, యర్రవరం రోడ్లలో జనంతో పాటు వాహనాల రద్దీ ఎక్కువైంది.

కోడి పందేలు

పలు గ్రామాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కోడి పందేలు నిర్వహించకూడదని నిషేధాజ్ఞలు ఉన్నా వాటిని ఎవరూ పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఓ పక్క కోడి పందేల బరులను పోలీసులు ధ్వంసం చేస్తున్నారు.

తుని మార్కెట్‌లో సందడి

సంక్రాంతి పండగను పురస్కరించుకుని వివిధ రకాల దుస్తులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసేందుకు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో తుని మార్కెట్‌లో సందడి నెలకొంది. మెయిన్‌రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు, బాలాజీ రోడ్డు, బెల్లపువీధి, పెద్దవీధి, చిన్నవీధి, తదితర ప్రాంతాల్లో షాపులన్నీ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి.

తునిలో అలరించిన సంక్రాంతి సంబరాలు

తుని అమ్మాజీపేట పేరూరివారి వీధిలో ఆదివారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఐద్వా అధ్యక్షురాలు జి.అమ్మతల్లి ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలతో సుందరంగా అలంకరించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఆట పాటలు, కోలాటం, బొమ్మలకొలువుతో సందడి చేశారు.

గజ్జనపూడిలో...

ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో గొనగాల అజయ్ ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మహిళలు, యువతులు భారీగా తరలివచ్చి ముగ్గులు పెట్టారు. సంప్రదాయం ఉట్టిపడేలా రంగురంగులు తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా నిర్వహించిన కోలాట ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త వరుపుల సుబ్బారావు తనయుడు సూరిబాబు విజేతలకు బహుమతులును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, ఎంపీటీసీ అమరాధి కాశి, రామిశెట్టి దొరబాబు, అల్లు సత్తిబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముగ్గుల పోటీలు

కిర్లంపూడి: సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలోని జగపతినగరం, గోనేడ గ్రామాల్లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. గోనేడలో జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఉలిసి ఐరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ, జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి పాతంశెట్టి సూర్యచంద్ర, జనసేన మహిళా నాయకురాలు చల్లా లక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు.

పాతకొట్టాంలో అయోధ్య రాముని అక్షతల పంపిణీ



పాత కొట్టాంలో శ్రీరాముని అక్షతలను భక్తులకు పంపిణీ చేస్తున్న హిందూ ధర్మ ప్రచారకులు

తుని: అయోధ్య రామ మందిరం నుంచి తీసుకువచ్చిన అక్షతలను పాత కొట్టాంలో భక్తులకు పంపిణీ చేసినట్టు సమరసత ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ వరహాలబాబు ఆదివారం తెలిపారు. పాత కొట్టాంలో హిందూ ధర్మ ప్రచారకులు ఆచారి, పలకా శ్రీను, చుక్కల రమణమూర్తి, చెల్లారావు తదితరులు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరాముడు ఆలయ నమూనా స్టిక్కర్లు, జెండాలు, అక్షితలను 525 మంది కుటుంబాలకు అందజేశారు.

ఇంటింటా భోగిభాగ్యాలు

- కన్నులపండువగా భోగి పండగ
- మంటల్లో పిడకలు వేసిన చిన్నారులు
- గ్రామాల్లో పండగ సందడి

ఏలేశ్వరం/తుని/తుని రూరల్/ శంఖవరం/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/గోకవరం/తొండంగి/అన్నవరం: కొత్త సంవత్సరంలో భోగభాగ్యాలు కలగాలని కోరుతూ ఆదివారం తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో భోగి పండగను వైభవంగా నిర్వహించారు. ప్రజలు తెల్లవారుజామునే తలస్నానాలు చేసి తమ ఇళ్ల, రహదారుల ముఖ్యకూడళ్లలో కలప, దుంగలతో భోగి మంటలు వేశారు. వీటితో చిన్నారులు ఆవు పిడకలతో చేసిన దండలను వేశారు. చిన్నలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి మంటల వద్ద గుమిగూడారు. కాగా సాయంత్రం మూడేళ్ల లోపు చిన్నారులకు భోగిపళ్లు వేసి వేడుకలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులను పిలిచి బహుమతులు అందజేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం, తిరుమాలి తదితర గ్రామాల్లో భారీఎత్తున భోగిమంటలు వేశారు. ఏలేశ్వరంలోని పల్లపు వీధి, దిబ్బలపాలెం తదితర ప్రాంతాల కూడళ్లలోని భోగి మంటల వద్ద యువత సందడి చేశారు. మండలంలోని పెద్దనాపల్లిలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి గంగిరెద్దుల దీవెనల పొంది పప్పుబియ్యం ఫలహారంగా సమర్పించారు. తుని మండలం కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో భోగి వేడుకలు నిర్వహించారు. భోగి పండగ విశిష్టతను సరస్వతీ మహాస్వామి వేదపండితులు, వేద విద్యార్థులకు వివరించారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద భారీ భోగిమంట వేశారు. తేటగుంట అతిథి గృహంలో శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు యనమల రామకృష్ణుడు తన కుటుంబ సభ్యులతో భోగి పండగను జరుపుకున్నారు. తుని పట్టణంలోని గణపతి నగర్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు మండలవ్యాప్తంగా ఆదివారం భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున పుణ్యస్నానాలు చేసి చిన్నా, పెద్ద తేడా లేకుండా భోగి మంటల వద్దకు పరుగులు తీశారు. తమ ఇళ్లలో పనికిరాని, పాత కలప వస్తువులను భోగి మంటల్లో వేసి పాతకు స్వస్తి చెప్పి కొత్తకు స్వాగతం పలికారు.



గోకవరంలో భోగి మంటలో పిడకలు వేస్తున్న చిన్నారులు, మహిళలు



ప్రత్తిపాడులో భోగిమంట వెలిగిస్తున్న బ్రహ్మకుమారీలు



జి.కొత్తపల్లిలో భోగి మంట వద్ద గ్రామస్తులు



ఏలూరులో సువారాట ఆడుతున్న తప్పెట గుళ్ల కళాకారులు

ముగిసిన షటిల్ టోర్నమెంట్

గోకవరం: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రంపయర్రంపాలెంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో అడ్డతీగలకు చెంది నికిల్, వసంత్‌లు విజేతలుగా, ఇందుకూరుపేటకు చెందిన సాయి, వినయ్ రన్నరప్‌గా నిలిచారు. జూనియర్స్ విభాగంలో గణేష్, ఉమ విన్నర్స్‌గా, అర్జున్, చరణ్‌తేజ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు సంఘం అధ్యక్షుడు చిక్కం దొరబాబు, ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల రాజు, ఆర్థిక కార్యదర్శి నవనాసి చలపతిరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చిక్కం సతీష్ బాబు, కర్రి నూకరాజు, కాకర విష్ణు, పాటి అపపలరాజు, నందం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గోదారంగనాథుల దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. పాత సంచుల వర్తక సంఘం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. గత నెల 16న ప్రారంభమైన ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదారంగనాథులకు కల్యాణం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. వందలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించి తరించారు. ఉదయం ధనుర్మాస పర్వదినాలను పురష్కరించుకుని సుప్రభాత సేవ, నిత్య హోమం, పూర్ణాహుతి, పల్లకీ సేవ, తీర్థ గోష్టి, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కాగా ఆదివారంతో ధనుర్మాసోత్సవాలు ముగిశాయి.

గోదారంగనాథుల కల్యాణం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో ఆదివారం రాత్రి గోదా రంగనాథుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పండితులు ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదా రంగనాథుల కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా పూర్తి చేశారు.



గోదా రంగనాథుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

మోటారు బైక్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న స్థానికులు

ఏలేశ్వరం: పట్టణంలో బజాబ్ పల్సర్ (ఎన్ఎస్ 220 మోడల్) బైక్ అకస్మాత్తుగా దగ్ధం కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. స్థానిక దిబ్బలపాలెనికి చెందిన సిద్ధు అనే యువకుడు పాతఅడ్డతీగల బస్టాండ్ వినాయకుని గుడి ఎదురుగా కర్రి పాయింట్ వద్ద బజాజ్ పల్సర్ బైక్‌ను పార్కింగ్ చేశారు. బైక్ నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి దగ్ధమైంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రత్నించారు. కాగా అప్పటికే బైక్ దగ్ధమైంది. కాగా ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

గోకవరం ఎస్సైగా నాగరాజు బాధ్యతల స్వీకరణ



గోకవరం: స్థానిక ఎస్సైగా కె.నాగరాజు ఆదివారంబాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన యువి శివనాగబాబు ఎయిర్ పోర్టు ఎస్సైగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరంలో జిల్లా ట్రైనింగ్ సెంటర్ నుంచి నాగరాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా గరుడ వాహన ఊరేగింపు

కిర్లంపూడి: మండలంలోని గోనేడలో ఆదివారం గరుడ వాహన ఊరేగింపు మహోత్సవం వైభవంగా జరిగింది. గోనేడ పెద్దరామాలయానికి గ్రామస్తుల ఆర్థిక సహాయంతో తయారు చేయించిన గరుడ వాహనానికి ప్రత్యేక పూజలు చేసి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు పాల్గొని సందడి చేశారు. అలాగే ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఇంటింటికీ అక్షతలు, కరపత్రాలు పంపిణీ చేశారు.



గోనేడలో నూతన గరుడ వాహనాన్ని ఊరేగిస్తున్న భక్తులు